క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజల్లో పాల్గొన్న అర్చకులు, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని శ్రీ గోదాపద్మావతి సమేత కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి మూలమూర్తికి నవకలశాలతో అభిషేకం, ప్రత్యేక అలంకారం, మంగళ శాసనం తదితర పూజా కార్యక్రమాలను పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు గోష్ఠి, నీరాజన మంత్ర పుష్పం గావించారు. కార్యక్రమంలో ఆలయ పాలక వర్గ సభ్యులు పి.నారాయణరెడ్డి, బి.వెంకట్ నారాయణ గౌడ్, టి.రంగారెడ్డి, నర్సిరెడ్డి, సూర్యప్రకాష్‌పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ కోదాడ ఇన్‌చార్జిగా అబ్రహం

నడిగూడెం: టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన బాణాల అబ్రహంను ఆ సంఘం కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేట నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లేటి లక్ష్మణ్, ప్రతినిధులు నన్నెపంగు సైదులు, కనకయ్య, రవి కుమార్ ఉన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

నడిగూడెం: మండల కేంద్రంలోని యాదవల కులదైవమైన గంగమ్మ ఆలయం వద్ద సోమవారం గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యావవులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీసుకున్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న హనుమారెడ్డి

నడిగూడెం: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబందంగా నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన అలుగుబెల్లి హనుమారెడ్డి రూ.10,116ల విరాళాన్ని సోమవారం నడిగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకన్న, వందనపు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతికి సంతాపం


గోవర్ధన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వెలుగూరి గోవర్ధన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహాన్ని పలువురు సీపీఎం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు వేనేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా, మండల నాయకులు మేదరమట్ల వెంకటేశ్వరరావు, చంద్రయ్య, నాగాటి రాములు, రాపోలు సూర్యనారాయణ, కొండారెడ్డి, విజయలక్ష్మి, స్టాలిన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

హుజూర్‌నగర్: అర్హులైన ప్రైవేట్ టీచర్లకు సింగిల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేటలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన ప్రైవేట్ టీచర్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి రామస్వామి గుట్ట వద్ద సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఎం.నాగరాజు, విజయ్ కుమార్, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి షాపులు.. ట్రాఫిక్ ఇక్కట్లు

- కోదాడలో రోడ్లను ఆనుకొని పండ్లు, ఇతర దుకాణాల నిర్వహణ
- వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలం కరువు
- నిరంతరం తప్పని ట్రాఫిక్ సమస్య


కోదాడలో ఓ షాపు ముందు పార్కింగ్ స్థలంలో పెట్టిన సామగ్రి

కోదాడ రూరల్: కోదాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. రాష్ట్ర సరిహద్దులో ఉన్న కోదాడ పట్టణానికి నియోజకవర్గ ప్రజలతో పాటు హుజూర్‌నగర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కూసుమంచి మండలాలు, ఏపీలోని జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వేల మంది ప్రజలు, వాహనదారులు వివిధ పనుల నిమిత్తం వచ్చిపోతుంటారు. దీంతో పట్టణంలో రద్దీ తీవ్రంగా పెరగడంతో ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రతరమైంది. ఫలితంగా వాహనాదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారులతోనే అసలు సమస్య!

రోడ్డు వెంట తోపుడు బండ్లు పెట్టే చిరు వ్యాపారులపై జులుం విదిల్చే పోలీసులు రోడ్డుకు ఆనుకొని పర్మినెంట్‌గా షాపులను ఏర్పాటుచేసుకుని ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న వారిపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలో కొందరు వ్యాపారులు షాపులను వదిలేసి రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నారు. షాపులు ఎక్కడో లోపటికి ఉంటే వారు మాత్రం రోడ్డు మీద వరకు తమ సామగ్రి పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఆయా రోడ్ల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందులు ఎక్కడెక్కడంటే..

ముఖ్యంగా బస్టాండ్ సెంటర్ ఎదురుగా ఉన్న షాపులు, నాగార్జున లాడ్జీకి ఆనుకొని ఉన్న పండ్ల వ్యాపారులు, అనంతగి రోడ్డులోని వ్యాపారులు, హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న కొన్ని పండ్ల వ్యాపారులతో పాటు సూర్యాపేట, ఖమ్మం క్రాస్‌రోడ్డు వైన్ షాప్‌ల వద్ద రోడ్డు మీద వరకు సామగ్రిని పెట్టడంతో వాహనాలకు పార్కింగ్‌కు స్థలం కరువైంది. దీంతో ఆయా షాపులకు వచ్చే వాహనదారులు రోడ్డు మీదనే తమ వాహనాలను నిలపాల్సి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న వ్యాపారులపై తగు చర్యలు తీసుకొని వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఈ చిత్రంలో కనిపిస్తున్నది కోదాడ పట్టణంలోని నాగార్జున లాడ్జీ పక్కనగల పండ్ల షాపు వ్యాపారి ప్రధాన రోడ్డు డివైడర్ మీద పెట్టన తన షాపునకు సంబంధించిన సామగ్రి. ఈయన పూర్తిగా రోడ్డుకు ఆనుకొని తన షాపు ఏర్పాటు చేసి పండ్లు అమ్ముతున్నాడు. పండ్లు కొనుక్కునే వారు వాహనాలను నలి పేందుకు కనీసం ఈ షాపు ముందు స్థలం లేదు. పైగా షాపు కట్టేశాక సామగ్రి రోడ్డు డివైడర్‌పై పెట్టి వాటికి రక్షణగా ఇలా ఓ ఐరన్ జాలీని చెట్టుకు కట్టి నిలబెట్టారు. ఈ జాలీ గాలి దుమారం వస్తే రోడ్డుపై పడి వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇలా పట్టణంలో పలు చోట్ల కొందరు వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు కానీ మున్సిపల్ సిబ్బందిగాని పట్టించుకోవట్లేదు.

గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలి


మునగాలలో ఓ రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ, రెవెన్యూ సిబ్బంది


అనంతగిరిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల: మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలని కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ అన్నారు. సోమవారం ఆయన మునగాల మండల కేంద్రంలోని నాగార్జున, శ్రీబాలాజీ ఫార్ బాయిల్డ్, మహాలక్ష్మి మిల్లులను స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా మిల్లుల్లో రికార్డులు, స్టాకులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 29లోగా మిల్లర్లు ప్రస్తుత యాసంగి సీజన్‌లో కేటాయించిన సీఎంఆర్‌ను ఇవ్వాలని, లేకుంటే చర్యలు ఉంటాయిని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, గిర్దావర్ రామారావు, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థల పరిశీలన

అనంతగిరి: ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేందుకు స్థల పరిశీలన చేసినట్లు ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం అనంతగిరి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 1470లోని ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతిపాదనలు సిద్ధంచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. సదరు సర్వే నెంబర్ అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ కనకారావు, సిబ్బంది ఉన్నారు.

రైస్ మిల్లులో తనిఖీలు

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామ శివారులోని ఎంకేఆర్ మోడ్రన్ రైస్ మిల్లులో సోమవారం సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాములు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రబీ, ఖరీఫ్‌లకు కలిపి 15,795.440 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం కేటాయించారని, మిల్లు యాజమాని మల్లేపల్లి కర్ణాకర్ ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకపోడంతో పైఅధికారుల ఆదేశానుసారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, సిబ్బందితో కలిసి మిల్లులో తనిఖీ చేశామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సీఎంఆర్ ధాన్యాన్ని దారిమళ్లించారని, దీని విలువ సుమారు రూ.31.99కోట్లు ఉంటుందన్నారు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఈట సైదులు తెలిపారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం


ఎంపీపీ సుజాతశ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

గరిడేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు ఎంపీటీసీలను మండల స్థాయి అధికారులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తనతో పాటు పనిచేసి మండలాభివృద్ధిలో భాగస్వాములైన తోటి ఎంపీటీసీలను ఎంపీపీ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తమ ఐదేళ్ల పదవీకాలం జూలై 4తో ముగుస్తున్నందున ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇంతకాలం తమకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కన్నంతరెడ్డి వనజ, తహసీల్దార్ బండ కవిత, వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, వెంకటరమణారెడ్డి, ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్‌తో పాటు పలువురు మండల స్థాయి అధికారులు ఎంపీటీసీలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్పుట, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓస్ కాలనీ, వెంకట్ నగర్, సాయి బాబా థియేటర్ రోడ్డు, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నోటు పుస్తకాలు పంపిణీ

నేరేడుచర్ల: మండలంలోని దాచారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యడవెల్లి సత్యనారాయణరెడ్డి, క్లబ్ సభ్యులు జి.సైదిరెడ్డి, చిలకరాజు శ్రీను, వెంకటేశ్వర్లు, హరీష్, సైదులు, రమ్య తదితరులు పాల్గొన్నారు.


దాచారంలో విద్యార్థులకు నోటు బుక్స్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రుణమాఫీ ప్రకటించడం హర్షణీయం


మాట్లాడుతున్న ఎంపీపీ సుజాతశ్రీనివాస్ గౌడ్

గరిడేపల్లి: రైతులకు రూ.2లక్షల మేర పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని గరిడేపల్లి ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి రూ.98లక్షల నిధులు మంజూరు చేయగా బోర్లు వేయించినట్లు తెలిపారు. ఎంపీపీగా తన హయాంలో మండలాభివృద్ధికి ఎంతగానో కృషిచేశామన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని ఎంపీడీఓ వనజ సమాధానమిచ్చారు. అనంతరం తహసీల్దార్ బండ కవిత మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త రేషన్ కార్డులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమానికి సన్నద్ధం కావాలని ఎంపీడీఓ సూచించారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి, ఏఓ ప్రితంకుమార్, ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, విద్యుత్ ఏఈ నగేష్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

మఠంపల్లి: మండలంలోని రైతులకు వానాకాలం సీజన్ వరిసాగుకు సంబంధించి అందజేస్తున్న ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మఠంపల్లి పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ కోరారు. సోమవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2లక్షల రుణమాఫీని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వారి వెట పీఏసీఎస్ డైరెక్టర్‌లు లాస్యానాయక్, అంతోని తదితరులు ఉన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


రేఖా ఇందు


తోట సంజన


జి.సృజన


పి.వెంకటేష్

హుజూర్‌నగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీడీఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఫలితాలు విడుదలైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని రేఖా ఇందు ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించిందన్నారు. అదే విధంగా తోట సంజన (ఎంపీసీ) 446/470, పిల్లుట్ల వెంకటేష్ (ఓఏ ఒకేషనల్ కోర్సు) 458/500, జి.సృజన (హెచ్‌ఈసీ) 439/500 మార్కులు సాధించి కాలేజీ టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. కాగా రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థిని రేఖా ఇందు, ఇతర విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జానపాటి కృష్ణయ్య అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గరిడేపల్లి: ధరణిలో నెలకొన్న సమస్యలని పరిష్కరించి రైతుల ఇబ్బందులు తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన తప్పులకు రైతులు బలయ్యారని, చిన్న, సన్నకారు రైతుల భూములు, ఇతరుల పేరుతో రావడం, విస్తీర్ణం తప్పులుగా రావటం, ఏనాడో దశబ్దాల క్రితం భూములు అమ్మిన వారిపై మళ్లీ పట్టాలు రావటం ఏంటని ప్రశ్నించారు. రైతులు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని, దీంతో కొంతమంది రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ధరణి సమస్యలు పరిష్కంచి మాటనెలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, రైతు సంఘంమండల నాయకులు పందిరి నాగయ్య, చేవ వెంకన్న, అలవాల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ

మునగాల: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములను కాపాడాలని మండలంలోని నర్సింహపురం గ్రామానికి చెందిన డాక్టర్ వేమూరి సత్యనారాయణ కోరారు. సోమవారం మునగాలలో జరిగిన ప్రజావాణిలో తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో దేవాలయ, వక్ఫ్‌బోర్డు, చెరువు శిఖం, గ్రామకంతం, అసైన్డ్ భూములతో పాటు వివిధ రకాల ప్రభుత్వ భూములను సర్వే చేయించి హద్దురాళ్లను ఏర్పాటు చేసి ఆయా భూముల వద్ద సర్వే నంబర్లు, విస్తీర్ణంతో సహా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

చెరువు మట్టి తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు

మునగాల మండల పరిధిలోని తాడువాయి శివారులో గల ఎర్రచెరువు నుంచి నాలుగు రోజులుగా రాత్రివేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యవహారంపై మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు మండల నీటిపారుదల శాఖ జేఈ నరసింహామూర్తి తెలిపారు. ఈ విషయంపై తాడువాయి గ్రామానికి చెందిన పలువురు గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సోమవారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాగిశెట్టి శ్రీనివాస్ సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు మట్టి అక్రమ తరలింపులో గ్రామానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ఓ విలేకరి హస్తం ఉన్నట్లు ఫిర్యాదుదారుడు ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ ఆంజనేయులును వివరణ కోరగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు నా దృష్టికి రావడంతో ఇరిగేషన్ జేఈకి సమాచారమిచ్చి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో జేఈ కోరినట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని లక్కవరం గ్రామంలోని 4వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చి నాలుగు నెలలు అవుతున్నా పనులు ప్రారంభించలేదని, ఇప్పటికైనా వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జూనియర్ అసిస్టెంట్ యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పొన్నెబోయిన నాగరాజు, కొంపెల్లి రాంరెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, మాధవి, నాగలక్ష్మి, గంగమ్మ, నర్సమ్మ, సరోజనమ్మ, ధనమ్మ ఉన్నారు.

శివాలయంలో విశేష పూజలు

మేళ్లచెరువు: మండలం కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. అనంతరం ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై మహిళలకు శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

నడిగూడెం: మండలంలోని సిరిపురం రైతు వేదికలో నాబార్డు ఆర్థిక సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు సేంద్రియ వ్యవసాయంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం అనంతగిరి మండలం చనుపల్లికి చెందిన అభ్యుదయ రైతు ఏలేటి వెంకటేశ్వరరెడ్డి సందర్శించి మాట్లాడారు. ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేస్తూ.. ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయిస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. అనంతరం వల్లాపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు వెంకటేశ్వర్లు సేంద్రియ పద్ధతుల్లో చీడపీడల నివారణకు వివిధ రకాల ద్రావణాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తమ్మర ఆలయ భూముల కౌలు వేలం


వేలంలో పాల్గొన్న అధికారులు, రైతులు

కోదాడ రూరల్: కోదాడపరిధిలోని తమ్మర గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూములకు సోమవారం ఎండోమెంట్ అధికారులు కౌలు వేలం నిర్వహించారు. 15 ఎకరాల వ్యవసాయ భూమికి అదేగ్రామ రైతులు రూ.6.48 లక్షలకు పాటపాడి వేలం దక్కించుకున్నారు. ఇందులో మూడెకరాలను సామినేని వెంకటేశ్వర్లు రూ.1.32లక్షలు, ఆరెకరాలను మందలపు రమేష్ రూ.2.61లక్షలు, రెండు ఎకరాలను తూమాటి రామయ్య రూ.1.01లక్షలు, 1.01 ఎకరాలను నాగుల్ మీరా రూ.32వేలకు, 2.39 ఎకరాలను సూరేపల్లి వీరభద్రం రూ.1.22లక్షలకు ఒక సంవత్సరం సాగు చేసేందుకు భూములను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేణు, మిర్యాలగూడ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈఓ చలపతి, శ్రీధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముక్త్యాల కాలువకు సీసీ లైనింగ్

- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు
- చిలుకూరు పరిధిలో ఇప్పటికే 13 కి.మీ. మేర పూర్తి
- అనుసంధాన మేజర్, మైనర్లకు కూడా..
- కాలువ చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు


చిలుకూరు పరిధిలో వేసిన సీసీ లైనింగ్

మంజూరైన నిధులు	రూ.184.60కోట్లు
మొత్తం లైనింగ్ పొడవు	77 కి.మీ.
నిర్మించాల్సిన వంతెనలు	02
అండర్ టన్నెల్స్	09

చిలుకూరు: ముక్త్యాల బ్రాంచి కెనాల్‌కు సిమెంట్ కాంక్రీట్ (సీసీ) లైనింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువ మునగాల హెడ్ రెగ్యులేటర్ నుంచి ముక్త్యాల కాలువ ప్రారంభమవుతుంది. ఈ కాలువ చిలుకూరు మండలం మీదుగా కోదాడ-హుజూర్‌నగర్ రోడ్డును క్రాస్ చేస్తూ హుజూర్‌నగర్ నియోజకవర్గం చింతిర్యాల మేజర్ వరకు ఉంటుంది. దీని కింద కోదాడ నియోజకవర్గ పరిధిలో 12 మేజర్లు, హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 20 మేజర్లు ఉన్నాయి. కాలువ కింద దాదాపుగా 150 వరకు మైనర్ కాలువలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1.10లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువ లైనింగ్ సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు నీళ్లు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.184.60 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సీసీ లైనింగ్ చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే కాలువకు బుంగలు పడే బాధ తప్పడంతో పాటు చివరి ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

77 కిలోమీటర్ల మేర లైనింగ్..

మునగాల మండలం జీరో కిలోమీటర్ నుంచి చింతిర్యాల మేజర్ వరకు 29 కిలోమీటర్లు ఉంది. ఈ 29 కిలోమీటర్ల కాలువకు సీసీ లైనింగ్ చేయనున్నారు. అలాగే ఈ కాలువ పరిధిలో ఉన్న 20 మేజర్లు ఉండగా వీటిల్లో మట్టపల్లి, లింగగిరి, గుండ్లపల్లి, చింత్రియ్యాల మేజర్లతో కలిపి మొత్తం 77 కిలోమీటర్ల మేర సీసీ లైనింగ్ చేయనున్నారు. ఈ ముక్త్యాల కాలువ పరిధిలో తొమ్మిది అండర్ టన్నెల్స్‌తో పాటు చిలుకూరు మండల పరిధిలోని కొండాపురం వద్ద డబుల్ లైన్ వంతెన నిర్మించనున్నారు. ఇక్కడకు దగ్గరలోనే రెడ్లకుంట మేజర్ వద్ద వంతెన ఉన్నప్పటికీ అది శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నుంచి కొద్ది దూరంలో మరో వంతెన నిర్మించనున్నారు. కాలువకు సీసీ లైనింగ్‌తోపాటు, కాలువకు ఇరువైపులా కట్టకు మట్టి పోసి పటిష్టం చేయనున్నారు. ప్రస్తుతం చిలుకూరు మండల పరిధిలో 13 కిలోమీటర్ల మేర సీసీ లైనింగ్ పనులు పూర్తయ్యాయి.

పనులు కొనసాగుతున్నాయి

ముక్త్యాలు కాలువ సీసీ లైనింగ్‌కు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ కాలువకు సీసీ లైనింగ్‌తోపాటు కొండాపురం వద్ద నూతన డబుల్ లైన్ వంతెన నిర్మించనున్నారు. అలాగే అండర్ టన్నెల్స్, కాలువ కట్టను మట్టితో పటిష్టం చేయనున్నారు. కాలువ సీసీ లైనింగ్ పనులు పూర్తయితే ఆయకట్టు చివరి భూములకు నీళ్లు పూర్తిస్థాయిలో అందనుండడంతో రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి.

– మానస, ఇరిగేషన్ ఏఈ, చిలుకూరు